# అడ్డుగోడ

శ్రీనివాసులు రిటైరయ్యాక స్వగ్రామం వచ్చేశాడు. హైదరాబాద్ నగర జీవితం వదిలి పెట్టి పల్లెటూరు వచ్చి ఉండడానికిద అతని భార్య కమలమ్మకి ఏ మాత్రం ఇష్టం లేకపోయినా రాక తప్పలేదు. పిల్లలిద్దరిలో ఒకడు బొంబాయిలో, మరొకడు మద్రాసులో ఉద్యోగాలు చేస్తుండడంతో ఎటువంటి బాదరబందీ లేకుండా స్వగ్రామంలోనే జీవితం చివరి దశ గడిపెయ్యాలని గట్టి పట్టుదలతో వచ్చేశాడు శ్రీనివాసులు.

రావడం రావడంతోనే తాత ముత్తాల నాటి పూరిల్లు మార్చివేసి అందంగా చిన్న డాబా కట్టుకున్నాడు. ఇంటి ముందు చిన్న పూల తోట పెంచాడు. ఊరంతా బాగా మారిపోయినట్లనిపించింది శ్రీనావాసులుకి. చిన్న పల్లెటూరు మేజర్ పంచాయతీ అయ్యింది. పాల కేంద్రం వచ్చింది. పశువుల ఆసుపత్రి, ఆరోగ్య కేంద్రం, లైబ్రరీ ఉన్నాయి. అతను చిన్నప్పుడు చదువుకున్న ప్రాథమిక పాఠశాల ఇప్పుడు హైస్కూలు అయ్యింది.

శ్రీనివాసులు చిన్నప్పటి రోజుల్లో – కరెంటు ఉండేది కాదు. రోడు మీద సిమెంటు స్తంభాలపై కిరోసిన్ దీపాలు రాత్రిపూట అమర్చి ఉదయం తీసుకువెళ్ళేవారు పంచాయతీ బోర్డు వాళ్ళు. ఊరి మధ్య బందుల దొడ్డి ఉండేది. అదుపూ, ఆపూ లేకండా పొలాల్లో పడి మేసే పశువుల్ని తెచ్చి బందుల దొడ్డిలో పెట్టేవాళ్ళు. ఇప్పుడా బందుల దొడ్డి స్థానంలో పశువుల ఆసుపత్రి వెలిసింది.

ఊళ్ళో షావుకారు రేడియో కొనుక్కుని వస్తే ఊళ్ళో వాళ్ళంతా విచిత్రంగా షావుకారు ఇంటి ముందు మూగేవాళ్ళు, రేడియోలో నుంచి మాటలు, పాటలు వస్తుంటే అందరూ ఆశ్చర్యంగా నోరు వెళ్ళబెట్టేవాళ్ళు. ఊరికి కరెంటు వచ్చాక షావుకారు ఇంటి నిండా కరెంటు బల్బులు పెట్టించి రాత్రిపూట వెలిగిస్తే తాజ్‌మహల్‌ను చూస్తున్నంత సంబరంగా ఆ ఇంటిని చూసేవాళ్ళు జనం. ఊళ్ళో ఒక టూరింగ్ టాకీస్ ఉండేది. సంవత్సరంలో ఆర్నెల్లు సినిమాలు ఆడేవి. అప్పటికి, ఇప్పటికీ పోలికే లేదు. ఊళ్ళో ఎక్కడ చూసినా టి.వి. లు కూడా వచ్చాయి ఇప్పుడు.

ఉదయాన్నే పొలాల గట్ల మీద తిరిగి రావడం, పేపరు తిరగేసి లైబ్రరీ అరుగుల మీద కూర్చుని గ్రామస్థులతో పిచ్చాపాటీ మాట్లాడడం, పదకొండు గంటలకు ఇంటికి తిరిగొచ్చేసి భోజనం చేసి గుర్రుపెట్టి నిద్రపోవడం, సాయంత్రం చెరువుగట్టు మీద షికార్లు... అందమైన సూర్యాస్తమయం చూసేసి ఇంటికి తిరిగొచ్చెయ్యడం ఇదీ శ్రీనివాసులు దిన చర్య.

పదవీ విరమణ చేశాక జీవితం ఆనందంగా గడిచిపోతున్న దనుకున్నాడు శ్రీనివాసులు.

గోవిందయ్య కుటుంబంతో పరిచయం శ్రీనివాసులుకు మరింత కాలక్షేపం, ఆనందాన్ని కలిగించింది.

శ్రీనివాసులు ఇంటి వెనుకే గోవిందయ్య ఇల్లు ఉంది. రెండు ఇళ్ళ మధ్య నాలుగు అడుగుల ఎత్తు ఉన్న ప్రహరీ గోడ ఉంది. ఉదయం పెరట్లో నిలబడితే గోవిందయ్య పాలు పితికే దృశ్యం. తులసి కోట చుట్టూ ప్రదక్షిణలు చేస్తే పూజలు చేసే భ్రమరాంబ, పూల మొక్కల మధ్య వనరాణిలా తిరిగే గోవిందయ్య కూతురు లక్ష్మి కనిపించే వాళ్ళు.

తులసి కోట చుట్టూ ప్రదక్షిణలు పూర్తయ్యాక బెల్లం ముక్క తెచ్చి శ్రీనివాసులుకు ఇచ్చేది గోవిందయ్య భార్య భ్రమరాంబ. దొడ్లో కనకాంబరాలు కోసి లక్ష్మిని పెట్టుకోమ్మని ఇచ్చేది శ్రీనివాసులు భార్య కమలమ్మ.

గోవిందయ్య గారింట్లో వండే గారెలన్నీ, గోంగూర పచ్చడన్నా, పప్పు చారన్నా శ్రీనివాసులుకు ఇష్టం. కమలమ్మ గారి హైదరాబాద్ వంటకాలను ఇష్టపడేది భ్రమరాంబ.

ఇంట్లో ఉన్నప్పుడు ఎక్కువ సేపు పెరటి గోడ దగ్గరే నిలబడి గోవిందయ్యతో కబుర్లు చెబుతూ ఉండేవాడు శ్రీనివాసులు. బాదం చెట్టు నీడలో ఆ ప్రహరీ గోడ మీద కూర్చుని కబుర్లు చెప్పుకోవడం సరదాగా ఉండేది ఇద్దరికీ.

ఎప్పుడన్నా హైదరాబాద్ వెళ్ళినప్పుడు లక్ష్మికి బొమ్మల కొలువు పెట్టుకోవడానికి రక రకాల బొమ్మలు తెచ్చేవాడు. గోవిందయ్యకు మేలు రకం ముక్కు పొడుం తెచ్చి ఇచ్చేవాడు.

పల్లెటూరి వంటకాలు రుచి చూపించేది భ్రమరాంబ. ఆమె చేతి వంటలంటే అమృత మనుకునేవాడు శ్రీనివాసులు.

రోజులన్నీ ఒకే రకంగా ఉండవు. ఆప్యాయంగా ఉండే మనుష్యుల మధ్య అడ్డు గోడ లేర్పడతాయి. వాటిని గుర్తించకపోతే సరిహద్దు గోడలే గోతులు తీసి గోడలను కట్టిన మనుష్యులనే పూడ్చిపెడతాయి.

శ్రీనివాసులు భార్య కమలమ్మకు ఒక విషయం నచ్చలేదు.

పెరటి గోడ ప్రక్కనే పాడి గేదె దగ్గర రొచ్చంతా తెచ్చి గోవిందయ్య పెంట పోగు ప్రోగు చెయ్యడం కమలమ్మకు ఇష్టం లేదు.

"పెరటి గోడ ప్రక్కనే పెంట ప్రోగు పెట్టుకోవడమేమిటండీ! పెరటి గోడ దగ్గరికి రాగానే పాడు వాసన. ఊరి బయటో, రోడ్డు చివర్లోనో పెంట పోగు వేసుకోవాలిగాని ఇంట్లో ఏమిటండీ? ఒకసారి గోవిందయ్య గారికి చెప్పి చూడకూడదూ!" అంది కమలమ్మ శ్రీనివాసులుతో.

అదేదో చిన్న విషయమే ననుకుంటూ తలూపేశాడు. శ్రీనివాసులు, మరుసటి రోజు ఉదయం బ్రష్ నోట్లో పెట్టుకుని రాగానే గోవిందయ్య కనిపించాడు. పెంట పోగు విషయం కదిలించాడు.

"పెంట పోగు ఊరి బయట పడేసుకోవడానికి అదేం పనికిరానిదా? మాకు పెంట పోగు కూడా బంగారమే! పల్లెటూళ్ళల్లో అందరి ఇళ్ళల్లో పెంటపోగు లుంటాయి. పెంటపోగు వాసన మీకు నచ్చకపోతే ముక్కు మూసుకోండి!" అంటూ కొంచెం కటువుగానే అన్నాడు గోవిందయ్య.

గోవిందయ్యకు కోపం వస్తుందని శ్రీనివాసులు ఊహించలేదు. అనవసరంగా పెంట పోగు ప్రసక్తి తెచ్చినందుకు తనను తానే తిట్టుకున్నాడు.

రెండు మూడు రోజుల్లో చాలా మార్పులొచ్చాయి. గోవిందయ్య శ్రీనివాసులుతో మాట్లాడడం మానేశాడు. భ్రమరాంబ నోటికొచ్చినట్లు కోడినో, కుక్కనో అడ్డం పెట్టుకుని శ్రీనివాసులు గోడ దగ్గరకు వచ్చినప్పుడు తిట్టడం మొదటు పెట్టింది. కమలమ్మ కూడా శాపనార్థాలు మొదలుపెట్టింది.

దేవాలయం దగ్గర యుద్ధ భేరీలు మ్రోగుతున్నట్లు కలవరపడింది లక్ష్మి. ఎవరికీ సర్దిచెప్పలేని పరిస్థితి ఆ అమ్మాయిది.

గోరుచుట్టుపై రోకటి పోటు అన్నట్లు మరో సంఘటనతో ఆ రెండు కుటుంబాల మధ్య అడ్డుగోడ ఎత్తు మరింత పెరిగిపోయింది.

కొక్కెర రోగం వచ్చి గోవిందయ్య ఇంట్లోని మూడు కోడి పెట్టలు చచ్చిపోయాయి. కమలమ్మ అన్నంలో విషం కలిపి తన కోడి పెట్టలను చంపిందని చుట్టు ప్రక్కల వాళ్ళకి చెప్పింది భ్రమరాంబ.

రెండు రోజులు అన్నం మానేసి మంచం దిగలేదు కమలమ్మ. శ్రీనివాసులు సముదాయించినా వినకుండా ఏడుస్తూనే ఉందామె.

ఇంటి వెనుక వైపుకు వెళ్ళడమే మానేశాడు శ్రీనివాసులు.

మాట్లాడడం మానేసినా కలహాలు తగ్గు ముఖం పట్టలేదు.

శ్రీనివాసులు పెంపుడు కుక్క గోడ దూకి భ్రమరాంబ వేసుకున్న కొత్తిమేర మడిని, తోట కూర మొక్కల్ని పాడు చెయ్యడంతో, ఇనుపగొట్టంతో కుక్క నడ్డి విరగ్గొట్టింది భ్రమరాంబ.

"కొత్తిమీర మడి పాడయిపోయిందని చెబితే నష్ట పరిహారంగా పదో పరకో ఇచ్చే వాళ్ళంగా! హైదరాబాద్ నుంచి తెచ్చుకున్న మా పామెరిన్ కుక్క పిల్లల్ని కొట్టడమెందుకు?" అంది కమలమ్మ పక్కింటి ఆవిడతో.

"పదో వరకో పుచ్చుకోవడానికి మేము గతిలేని వాళ్ళంకాదు ! మా పెంట పోగు వాసన పడదుకాని, హైదరాబాద్ కుక్క ఇంట్లో ఏరిగినా ఆ వాసన వాళ్ళకు బాగానే ఉంటుంది." కమలమ్మ మాటలు మోసుకు వచ్చిన పక్కింటావిడతో అంది భ్రమరాంబ.

రెండు కుటుంబాల మధ్య అగాధం మరింత పెద్దదయింది.

పదేళ్ళ క్రితం శ్రీనివాసులుతో పాటే గుంటూరులో పని చేసిన పుండరీకాక్షయ్య కొడుకును వెంట బెట్టుకుని శ్రీనివాసులు ఇంటకి వచ్చాడు.

భోజనాలయ్యాక వచ్చిన పని గూర్చి చెప్పాడు పుండరీకాక్షయ్య.

"మా వాడు బొంబాయిలో పెద్ద సైంటిస్టు. కానీ వాడి అభిరుచి ఏమిటంటే పూర్తిగా పల్లెటూరి వాతావరణంలో పెరిగిన అమ్మాయిని పెళ్ళి చేసుకోవాని – మీ ఊళ్ళో గోవిందయ్య గారు అనే ఆయన మర్యాదస్తుడు. వాళ్ళమ్మాయి చక్కని చుక్కని విన్నాను... మా వాడికి నచ్చితే చేసుకోవాలనుకుంటున్నాము."

పుండరీకాక్షయ్య మాటలు విని మూతి ముడిచింది కమలమ్మ. గోవిందయ్య గూర్చి చెప్పమని కళ్ళతో సైగ చేసిందామె భర్త వైపు చూస్తూ.

ఒక క్షణం ఆలోచనలో పడ్డాడు శ్రీనివాసులు. మొన్న మొన్నటి వరకు ఎంతో సాన్నిహిత్యంతో మెలిగిన గోవిందయ్య కుటుంబ సభ్యులు మనస్సులో మెదిలారు.

"మా ఇంటి వెనుకే వాళ్ళ ఇల్లు... గోవిందయ్య నెమ్మదస్తుడు. మంచి మనిషి."

శ్రీనివాసులు ఒక మెట్టు క్రిందకు దిగాడు. గోవిందయ్య కుటుంబంపై ద్వేషం పెంచుకుంటూ ఎన్నో మెట్లు కొండ ఎక్కి కూర్చున్న అతని మనస్సు కోపాలు కొండ మెట్లు దిగడం తేలిక అనిపించింది. ఒక మెట్టు దిగాక మిగిలిన మెట్లు దిగడం మరీ తేలిక అనిపించింది,

"చాలా మంచి కుటుంబం... అమ్మాయి కుందనపు బొమ్మ... నా మాట మీద నమ్మకం ఉంటే ఈ సంబంధం ఖాయం చేసుకో" అన్నాడు శ్రీనివాసులు.

భర్త వైపు ఆశ్చర్యంగా చూసింది కమలమ్మ కొన్ని క్షణాలు ఆమె మనస్సు అయోమయంలో పడింది. భర్త మాటలు, చేతలు మీద గురి ఉండడంతో ఆమె మనస్సులో గోవిందయ్య కుటుంబం పట్ల పేరుకు పోయిన వైముఖ్యం పొరలు కరిగిపోయి - పొరలు తొలగిపోయాయి.

పుండరీకాక్షయ్య లక్ష్మిని చూసి వెళ్ళాక - మరుసటి రోజు పెరటి గోడ దగ్గర నిలబడ్డాడు శ్రీనివాసులు.

పాలు పితుకుతూ గోవిందయ్య కనిపించాడు. తల స్నానం చేసి తులసి కోట చుట్టూ ప్రదక్షిణ చేస్తూ భ్రమరాంబ కనిపించింది. గులాబీ మొక్కలకు నీళ్ళు పోస్తున్న లక్ష్మిని పలకరించాడు శ్రీనివాసులు.

"ఏమమ్మో పెళ్ళి కూతురా? ఇక పెళ్ళయితే మాకు కనిపించవు కాబోలు... మా పుండరీకాక్షయ్య కొడుకు నెల రోజుల్లోనే ముహూర్తం చూడమని తొందరపడుతున్నాడు... మీ నాన్న ఏం ఏర్పాట్లు చేస్తాడో చూడాలి" అన్నాడు శ్రీనివాసులు గట్టిగా గోవిందయ్యకి వినపడాలనే.

"పక్కన మీరుండగా నాకేమిటండీ దిగులు" అన్నాడు గోవిందయ్య ఒక చేత్తో పాల చెంబు పట్టుకుని - మరో చేత్తో దూడని వదిలి పెడుతూ.

"మీ స్నేహితుడు వప్పుకున్నట్లేనా అన్నయ్య గారూ? పెద్దగా ఆస్తిపాస్తులు లేని వాళ్ళం" అంది భ్రమరాంబ ప్రసాదం తెచ్చి శ్రీనివాసులు చేతిలో ఉంచుతూ.

"కట్న కానుకలు ఎందుకమ్మా? బంగారం లాంటి మనుష్యులతో వియ్య మందబోతున్నాడు మా పుండరీకాక్షుడు."

శ్రీనివాసులు పక్కనే వచ్చి నిలబడింది కమలమ్మ. గోడ మీద నుంచే కమలమ్మ చేతిని తన చేతుల్లోకి తీసుకుని ఆప్యాయంగా నిమిరింది భ్రమరాంబ. ఆమె కళ్ళలో తొణికిసలాడుతున్న ఆనంద భాష్పాలు చూసి చలించింది కమలమ్మ.

ఒక పక్క నుంచి ఉలవ చారూ, ములక్కాడలు వేసిన పప్పు చారు, మరో ప్రక్క నుంచి సేమ్యా ఇడ్లీ సమోసాలూ సరఫరా పెరటి వైపు ఉన్న గోడపై నుంచి మళ్ళీ మొదలయ్యింది." ✻

**(ఆంధ్రప్రభ వారపత్రిక - 29-8-1990)**